క్లుప్తంగా

మంత్రిని కలిసిన సెస్ డైరెక్టర్



మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు రాజన్న ప్రసాదం అందిస్తున్న సుధాకర్

బోయినపల్లి: రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సోమవారం మండల సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్ ధర్మపురిలోని క్యాంప్ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేములవాడ రాజన్న ప్రసాదం అందించారు. రాజరాజేశ్వరస్వామి కండువాతో సత్కరించారు. ఈ నెల 30న జిల్లాకేంద్రంలో జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళన సన్మాన సభలో పాల్గొనాలని మంత్రిని కోరినట్లు సుధాకర్ పేర్కొన్నారు.

విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం సరికాదు



మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట: గంభీరావుపేటలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయదలచిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ గద్దెను కూల్చివేసి అవమానపరిచారని నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. అనుమతుల పేరిట అధికారులు నిర్మాణంలో ఉన్న గద్దెను కూల్చివేయడం సమంజసం కాదన్నారు. మేధావి విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం అవివేకమని పేర్కొన్నారు. సెస్ మండల డైరెక్టర్ గొరినేని నారాయణరావు, విండో చైర్మన్ రాజనర్సింహారెడ్డి, నాయకులు వెంకటస్వామిగౌడ్, గంధ్యాడపు రాజు, కొమిరిశెట్టి లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, మల్లేశం, కమలాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, రత్నాకర్, దోసల శంకర్, పిట్ల శ్రీమతి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోం



మాట్లాడుతున్న మధు

సిరిసిల్లఅర్బన్: రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి కేటీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే ఉరుకునేది లేదని సర్పంచుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్‌కు కేటీఆర్ గురించి మాట్లాడే స్థాయి లేదన్నారు. పట్టణ అధ్యక్ష పదవినే డబ్బులు పెట్టి తెచ్చుకున్నావని తన పార్టీ వారే ఆరోపించారన్నారు. అలాగే బీఆర్‌ఎస్ పాలనలో ఇసుక రూ.2 వేలకే దొరికేదని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో రూ.5 వేలకు లభిస్తుందన్నారు. ఇదేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. ప్రజల పక్షనా నిలబడాలే తప్ప, ప్రశ్నించేవారిపై కక్ష సాధింపు ధోరణి మానుకోవాలని హితవుపలికారు. కొయ్యాడ రమేశ్, సిలివేరి చిరంజీవి, అనిల్‌రావు, రాజయ్య, బాలయ్య, ప్రేమ్‌కుమార్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాల యువత ఏకమవ్వాలి



నినాదాలు చేస్తున్న ప్రవీణ్‌కుమార్ తదితరులు

వేములవాడఅర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బడుగు, బలహీనవర్గాల యువత ఏకమవ్వాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలో భీమ్ ఆర్మీ పదో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదేళ్ల క్రితం ఉత్తరాది రాష్ట్రాల్లో దళిత సమాజంపై అగ్రవర్ణాల ఆగడాలకు వ్యతిరేకంగా చంద్రశేఖర ఆజాద్, వినయ్ రతన్‌సింగ్, సతీశ్‌కుమార్ భీమ్ ఆర్మీని ఏర్పాటు చేసి బలహీనవర్గాలను ఏకం చేసి వారికి జరిగే అన్యాయలపై పోరాటానికి సిద్ధమయ్యారన్నారు. నాయకులు హరీశ్, వినయ్, రాజు, ప్రశాంత్, నాగరాజు, గోపి, విజయ్ తదితరులు ఉన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డిపేట ఎస్సై కె.రాహుల్‌రెడ్డి సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో సోమవారం కమ్యూనిటీ ప్రోగ్రాంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలని సూచించారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు.

సమస్యల ‘ప్రాంగణం’

- పార్కింగ్‌కు అడ్డాగా ఎల్లారెడ్డిపేట బస్టాండ్
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- గుంతలమయంగా ఆవరణ
- చెట్ల కిందే ప్రయాణికుల నిరీక్షణ



నిరుపయోగంగా మరుగుదొడ్లు



గుంతలమయంగా ఎల్లారెడ్డిపేట బస్టాండ్ ప్రాంగణం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట ఆర్టీసీ బస్టాండ్ సమస్యల ప్రాంగణంగా మారింది. రోజూ సుమారు వంద బస్సులు వచ్చివెళ్లే ఈ బస్టాండ్‌లో అనేక సమస్యలు తిష్ట వేశాయి. ప్రయాణికులతో పాటు స్థానికులు సమస్యలపై చాలాసార్లు ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదు. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు మరుగుదొడ్లు పనిచేయక ఉగ్గబట్టాల్సిందే. అలాగే ప్రాంగణంలో ఏర్పడ్డ పెద్దపెద్ద గుంతలతో ఇబ్బందులు తప్పడం లేదు. మారుమూల అటవీప్రాంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఏ బస్సు ఎప్పుడు వస్తుందో తెలియని దుస్థితి నెలకొంది. దీంతో ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయి.

ప్రధాన సమస్యలు ఇవే..

- మరుగుదొడ్లు ఉన్నా నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. తాగునీటి వసతి లేక ప్రయాణికులు హోటళ్లలోకి వెళ్లి నీరు తాగాల్సిన పరిస్థితి ఉంది.
- ప్రాంగణమంతా పారిశుధ్య లోపంతో కంపు కొడుతోంది. వ్యర్థాలను ప్రజలు ప్రాంగణంలోనే వదిలివెళ్తున్నారు. దీంతో దుర్వాసనతో తిప్పలు తప్పడం లేదు.
- బస్టాండ్ ఆవరణలో ప్రైవేట్ వాహనాలను దర్జాగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు వచ్చి వెళ్లడం ఇబ్బందిగా మారుతోంది.
- చిన్నపాటి వర్షానికి ప్రాంగణం బురదమయంగా మారుతోంది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో బస్సులు ఒక్కోసారి ప్రాంగణంలోకి రాకుండానే ప్రధాన రహదారి గుండా వెళ్లిపోతున్నాయి.
- దీంతో బస్సుల కోసం నిరీక్షించేవారు ప్రాంగణంలోనే ఉండిపోతున్నారు. బస్టాండ్ ప్రాంగణాన్ని పూర్తి స్థాయిలో సీసీగా మార్చాలని ప్రజలు చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలయ్యాయి.
- ఆర్టీసీకి ఆదాయం తెచ్చిపెడుతున్న బస్టాండ్‌లో సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



బస్టాండ్ ప్రాంగణంలో మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో వ్యర్థాలను వదిలేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రాంగణమంతా బురదగా మారి బస్సులు ఎక్కడం ఇబ్బంది అవుతోంది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– సల్ల సత్యంరెడ్డి, ఎల్లారెడ్డిపేట

మోడ్రన్ బస్టాండ్‌గా మార్చుతాం



బస్టాండ్ ప్రాంగణంలో సమస్యలు మా దృష్టికి వచ్చాయి. పరిష్కరించి ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తాం. బస్టాండ్‌లో ఉన్న గుంతలను పరిశీలించాం. కరీంనగర్ సివిల్ ఇంజనీర్ వాళ్లకు సమస్యను విన్నవించాం. తొందరలోనే మోడ్రన్ బస్టాండ్‌గా మార్చుతాం. వాహనాల పార్కింగ్‌కు టెండర్ ప్రక్రియ పూర్తయింది.

– ప్రకాశ్‌రావు, ఆర్టీసీ డీఎం, సిరిసిల్ల

టీడీఎఫ్ సేవలు అభినందనీయం



మహిళలకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, మహేందర్‌రెడ్డి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ముస్తాబాద్: సమాజహితం కోసం తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం చేస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ముస్తాబాద్‌లో శ్రీవెంకటేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు టీడీఎఫ్ ఆధ్వర్యంలో 30 కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే పథకాలను అమలు చేస్తోందన్నారు. టీడీఎఫ్ జాతీయ అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, టీడీఎఫ్ తెలంగాణలో 1999 నుంచి ప్రజాసేవ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, వైస్‌చైర్మన్ రాంరెడ్డి, వెంకటేశ్వర ఫౌండేషన్ చైర్మన్ కొరెడ్ల తిరుమల్‌రెడ్డి, టీడీఎఫ్ మహిళా అధ్యక్షురాలు శ్రీవాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ భవనం పరిశీలన

ముస్తాబాద్ రైతువేదిక ఆవరణలో తహసీల్ భవన నిర్మాణాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించారు. పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అదనపు పనులకు మరో రూ.10లక్షలు కేటాయిస్తామని పేర్కొన్నారు. అలాగే ఐకేపీ భవనంలో రైస్‌మిల్లును ప్రారంభించే అవకాశాలను పరిశీలించారు.

బీసీ సంఘం కార్యదర్శిగా మల్లేశ్‌యాదవ్



కోనరావుపేట: తెలంగాణ బీసీ సంఘం జిల్లా కార్యదర్శిగా మండలంలోని గొల్లపల్లి (వట్టిమల్ల) గ్రామానికి చెందిన నూనె మల్లేశ్‌యాదవ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు బత్తుల మహేందర్‌యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు.

కురుమ యాదవ సంఘం కార్యవర్గం



బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామ శ్రీకృష్ణ కురుమ యాదవ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోలే మల్లేశం, ఉపాధ్యక్షుడు మ్యాకల నర్సయ్య, కోశాధికారి ఏనుగుల అనిల్‌కుమార్, సంయుక్త కార్యదర్శి గోట్ల ఐలయ్య, సలహాదారుగా మిరుపాల కొమురయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాచర్లగొల్లపల్లిలో..



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో శ్రీకృష్ణ యాదవసంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెంజర్ల దేవయ్య, పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం సంఘ సభ్యులు దేవయ్యను సన్మానించారు.

శాకంబరిగా అమ్మవారు



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి మదేలేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సరస్వతి అమ్మవారు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు బాగా కురిసి సమృద్ధిగా పంటలు పండాలని వేడుకున్నారు.

విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి

ఇల్లంతకుంట: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడు బండారి చందుగౌడ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారం కోసం బంద్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

రేషన్‌కార్డులు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో సోమవారం రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నియమాలు పాటించాలి

ఎల్లారెడ్డిపేట: వాహనదారులు విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై రాహుల్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లి, ఎల్లారెడ్డిపేటలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురికి జరిమానా విధించారు.

రిలే దీక్షలు వాయిదా

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లి హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమైన సందర్భంలో తాత్కాలికంగా రిలే నిరాహార దీక్ష వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు అఖిలపక్షం నాయకులు తెలిపారు. గుంటి శంకర్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి రెడ్డి సంఘ భవనంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 100 మందికి కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరం ఉన్న వారిని కరీంనగర్ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

విజయ్‌రెడ్డికి అవార్డు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కోరుట్లపేటకు చెందిన రేవంత్ మిత్ర మండలి అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి ఉత్తమ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అవార్డును సోమవారం హైదరాబాద్‌లో అందుకున్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఉపేంద్రచారిని సోమవారం కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. శాలువాతో సన్మానించారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

ముస్తాబాద్: సీఎం సహాయనిధి పేద కుటుంబాలకు వరంగా మారిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం 68 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల అర్బన్: సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని పేదలు సద్వినియోగ పరుచుకోవాలని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్ గౌడ్ అన్నారు. సోమవారం బాబాజీకాలనీకి చెందిన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చరిత్రాత్మకం

ముస్తాబాద్: స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని సోమవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. రిజర్వేషన్లు కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజాగౌడ్, విక్కుర్తి లక్ష్మీనారాయణ, బండారు మల్లేశ్, సుధాకర్, శేఖర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రం శివారులోని దుమాల వంతెన వద్ద ప్రధాన రహదారి గుంతలమయంగా తయారైంది. గుంతల రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. రోడ్డుపై ఏర్పడ్డ పెద్దపెద్ద గుంతలతో వర్షం పడితే లోతు తెలియక వాహనదారులు అందులో పడి ఇబ్బందులు పడుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
కిరణ్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, ఎల్లారెడ్డిపేట, సెల్ నంబర్: 94408 18864

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పని చేయాలి

ఎల్లారెడ్డిపేట: కార్యకర్తలే పార్టీకి బలమని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు తదితర పథకాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గౌస్, మేడిపల్లి దేవానందం, జిల్లా కార్యదర్శులు వంగ గిరిధర్‌రెడ్డి, కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షులు సాహెబ్, నాయకులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య, శ్రీనివాస్, రవీందర్, చెన్ని బాబు, బుచ్చాగౌడ్, వెంకటేశ్, నంది కిషన్, గుర్రం రాములు, మధు తదితరులు పాల్గొన్నారు.

మహిళాసంఘం భవనానికి నిధులు



ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న గోపి

వీర్నపల్లి: మండల కేంద్రంలోని జీవనజ్యోతి సమైక్య మహిళా సంఘం భవన నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయని మండల అధ్యక్షుడు లకపతి నాయక్ సోమవారం సంఘ సభ్యుల సమావేశంలో పేర్కొనారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ప్రొసీడింగ్ కాపీ అందజేశారు. పొన్నాల తిరుపతిరెడ్డి, పిట్ల నాగరాజు, పల్లం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో బోరుబావులు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్, బందనకల్ గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు బోరుబావులు వేయించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు పరిస్థితిని వివరించగానే నిధులు కేటాయించారని, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మెరుగు అంజాగౌడ్, వరి వెంకటేశ్ పాల్గొన్నారు.

రూ.1.4 కోట్ల నిధులు..

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ రూ.1.4 కోట్లు మంజూరు చేశారు. సోమవారం పోచెట్టిపల్లి, నూకలమర్రి, జయవరం, నాగాయపల్లి గ్రామాల్లో బోరుబావులను ప్రారంభించారు. అధ్యక్షుడు పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వర్షాలు కురవాలని..

ఎల్లారెడ్డిపేట: వర్షాలు కురవాలని మండలంలోని రాచర్లగుండారంలో గ్రామస్తులు, రైతులు సోమవారం కప్పతల్లి ఆటలు ఆడారు. కర్రకు కప్పను కట్టి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామంలోని వీధుల వెంట తిరుగుతూ, వర్షాలు పడాలని దేవుడిని కోరారు. రైతులు వీధుల వెంట తిరుగుతుండగా కప్పతల్లిపై మహిళలు నీళ్లు పోస్తూ.. వర్షాలు పడి పంటలు బాగా పండాలని, పాడి పశుసంపద చల్లగా ఉండాలని గ్రామ దేవతలకు పూజలు చేశారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట: అప్పు ఇచ్చిన వ్యక్తి డబ్బులు అడిగినందుకు దాడిచేసిన ఘటనలో సోమవారం పోలీసులు ఒకరిపై కేసు నమోదు చేశారు. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని అక్కపల్లికి చెందిన పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన గోగూరి ప్రదీప్‌రెడ్డి బోర్ వేసుకోవడానికి రూ.70 వేలు అప్పు ఇచ్చాడు. డబ్బులు తిరిగి చెల్లించాలని శ్రీనివాస్‌రెడ్డి కోరగా ప్రదీప్‌రెడ్డి ఆదివారం రాత్రి దాడిచేసి అసభ్య పదజాలంతో దూషించి, చంపుతానని బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రదీప్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ శివారులో ఎల్లమ్మ ఆలయం వద్ద నలుగురు పేకాట ఆడుతుండగా, ఇద్దరు పరార్ కావడంతో ఇద్దరిని పట్టుకున్నట్లు ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపారు. రెండు సెల్ ఫోన్లు, రూ.7,600 స్వాధీనం చేసుకున్నట్లు, పరారైన వారి కోసం గాలిస్తున్నట్లు వివరించారు.